క్లుప్తంగా

20 లీటర్ల నాటుసారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో ఎస్‌ఐ కృష్ణారావు

గొలుగొండ : ఏటిగైరంపేట పంచాయతీ శివారు సీతకండి గ్రామంలో అక్రమంగా నాటు సారా అమ్మకాలపై గొలుగొండ ఎస్‌ఐ బి. కృష్ణారావు దాడి చేసి గ్రామానికి చెందిన డి.బోడేసును అరెస్టు చేసి కోర్టుకి తరలించారు. అతని దగ్గర నుండి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. గ్రామాల్లో నాటు సారా తయారీ, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఎన్నికల నియమావళి అమలులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. ఆర్డీవో, డీఎస్పీ మోహన్‌రావుతో కలిసి ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వీడియో సర్వేలైన్స్ టీం, అకౌంటింగ్, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లతో గురువారం సమావేశమయ్యారు. వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు తొలగించాలన్నారు. ఈ సమావేశంలో ఏఆర్‌వో శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ అవర్ పాటించాలని విద్యార్థుల ర్యాలీ



ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణకు అందరూ ఈ నెల 23న ఎర్త్ అవర్ పాటించాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ప్లకార్డులతో ఎర్త్ అవర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం కోసూరు రాము మాట్లాడుతూ గత ఏడాది అత్యధిక ఉష్ణోగ్రత నమోదైందన్నారు. శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 వరకు గంట పాటు ఎర్త్ అవర్ పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబు, ప్రసాదబాబుల ఆధ్వర్యంలో స్థాలీపాక హోమం, వివాహప్రవేశ ప్రధాన హోమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి ఫాల్గుణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయమండపంలో అలివేలుమంగ వేంకటేశ్వరస్వామివారి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం తర్వాత తలంబ్రాలు శిరస్సున ధరించారు. ఈవో టి.రాజసులోచన, సిబ్బంది రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల : స్థానిక పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం లావేటి సంతోచాచార్యులు శిష్య బృందం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్పెంటర్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో 100 మంది దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

- అభ్యర్థులు సింగిల్ విండో సిస్టంలో దరఖాస్తు చేసుకోవచ్చు
- సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా..
- 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేయొచ్చు
- నియోజకవర్గంలో 51 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- 'సాక్షి'తో చోడవరం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ



చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో చిన్నికృష్ణ

సాక్షి ఇంటర్వ్యూ

చోడవరం : అభ్యర్థులు తమ ప్రచారం కోసం సింగిల్ విండో సిస్టంలో దరఖాస్తు చేసుకోవచ్చని చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ గురువారం 'సాక్షి'కి తెలిపారు. ఫ్లెక్సీలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు ఇతర ప్రచారాలకు సంబంధించి అభ్యర్థులు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, లేనిపక్షంలో నేరుగా ఏఆర్‌వో (మండల తహసీల్దార్) కార్యాలయం, పోలీసు స్టేషన్, ఎలక్ట్రికల్, ఫైర్ స్టేషన్లలో ఏ ఒక్క చోట దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇస్తామని చెప్పారు. ఇప్పటికే రాజకీయ పార్టీలు, బీఎల్‌వోలు, ఎన్నికల అధికారులతో సమీక్షలు నిర్వహించామన్నారు. ఎన్నికలకు సంబంధించి చోడవరం కార్యాలయంలో నారాయణరావును ఇన్‌చార్జిగా నియమించామన్నారు. పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రికల్, ఫైర్ విభాగాలకు చెందిన అధికారులు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ సెల్ విభాగంలో అందుబాటులో ఉంటారన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకున్న వారు అక్కడ కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 18వ తేదీన ఎలక్షన్ నోటిఫికేషన్ వస్తుందని అప్పటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థుల ప్రచార ఖర్చులు 18 ముందు అయితే ఆయా పార్టీల ఖాతాల్లోను, 18 తర్వాత అయితే అభ్యర్థుల ఖాతాల్లో ఎన్నికల ఖర్చుగా నమోదు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 51 సమస్యాత్మక గ్రామాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌గా చోడవరం గవర్నమెంటు హైస్కూలును, రిసెప్షన్ సెంటర్‌గా అనకాపల్లి మండలం శంకరంలోని ఎస్‌పీ కార్యాలయం సమీపంలో ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌ను కేటాయించామని, అదే సెంటర్‌ను ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌గా కూడా ఉపయోగిస్తామన్నారు. ఈ ఏడాది నుంచి హోమ్ ఓటింగ్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమీషన్ కల్పించిందన్నారు. వీరు 12డి ఫారం దగ్గర్లో ఉన్న బూత్ లెవెల్ ఆఫీసర్‌కు అందజేయాలన్నారు. అటువంటి వారు ఓటు వేసేందుకు బ్యాలెట్ పత్రం, బాక్సు, పోలీసు ఎస్కార్ట్‌తో వారి ఇంటికి పంపిస్తామన్నారు. నియోజకవర్గంలో మూడు ప్రధాన చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చు లెక్కించేందుకు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేశామని రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ చెప్పారు.

నియోజకవర్గం వివరాలు

మొత్తం ఓటర్లు	-2,15,433
పురుషులు	- 1,04,600
మహిళలు	-1,10,827
థర్డ్ జెండర్స్	-6
దివ్యాంగులు (పీడబ్ల్యుడీ)	-4,259
85 ఏళ్లు దాటిన వృద్ధులు	- 2,183
పోలింగ్ కేంద్రాలు	-243
ఏఆర్‌వోలు	-4
పోలింగ్ ఆఫీసర్లు	-243
సూపర్‌వైజర్లు	-24మంది
సెక్టార్ ఆఫీసర్లు	-24మంది
రూట్ ఆఫీసర్లు	-24మంది
ఫ్లయింగ్ స్క్వాడ్	-9 టీమ్‌లు

దరఖాస్తులకు సువిధ యాప్‌నూ ఉపయోగించవచ్చు..

- అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చు 18 ముందు ఆయా పార్టీల ఖాతాల్లోను, 18 తర్వాత అభ్యర్థుల ఖాతాల్లో నమోదు అవుతుంది.
- ఫ్లెక్సీలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు ఇతర ప్రచారాలకు సంబంధించి అభ్యర్థులు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌గా చోడవరం గవర్నమెంటు హైస్కూలు, రిసెప్షన్ సెంటర్‌గా అనకాపల్లి మండలం శంకరం గ్రామంలోని ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ కేటాయింపు. అదే సెంటర్‌ను ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌గా కూడా ఉపయోగించనున్నారు.

ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



గజపతినగరంలో శ్రీముత్యాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : కోర్కెలు తీర్చే కల్పవల్లి గజపతినగరం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి పండగలో భాగంగా భారీ ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ వచ్చి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ఎన్నికవ్వాలని, చోడవరం ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీ రెండోసారి గెలవాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ మళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు ధర్మశ్రీకి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి సూరిశెట్టి నాగదుర్గగోవింద, ఎంపీటీసీ సభ్యుడు శరగడం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ల ఏర్పాటు



తహసీల్దార్ రమణారావు

రావికమతం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేస్తూ నిబంధనలకు విరుద్ధమైన ఎటువంటి కార్యక్రమాలనైనా నిలువరించేందుకు మండలానికి రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల నియామకం జరిగిందని తహసీల్దార్ రమణారావు గురువారం తెలిపారు. ఒక బృందం రావికమతం కేంద్రంగాను, మరొక బృందం కొత్తకోట కేంద్రంగా పని చేస్తాయని వివరించారు. గ్రామాల్లో మద్యం, నగదు పంపిణీ వంటి కార్యక్రమాలు, కోడ్ ఉల్లంఘిస్తూ నాయకులు చేసే కార్యక్రమాలపై వీరు నిఘా పెడతారన్నారు.

దివ్యాంగులకు తాత్కాలిక పునరావాస కేంద్రం



దివ్యాంగులకు సరుకులు పంపిణీ చేస్తున్న సతీష్

మాకవరపాలెం: మండల కేంద్రంలో దివ్యాంగులకు తాత్కాలిక పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని దివ్యాంగుల మ్యూచ్‌వల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ తమరాన సతీష్, వైస్ చైర్మన్ సత్యమోహనగోపి తెలిపారు. స్థానిక తార భవనం వద్ద గురువారం మండలంలో 20 ఏళ్లు పైబడిన దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ అధికారులు స్పందించి దివ్యాంగులకు శాశ్వత పునరావాసం కల్పించేందుకు వసతి సౌకర్యం కల్పించాలన్నారు. తాత్కాలిక పునరావాస కేంద్రంలో నియోజకవర్గంలోని ఏ గ్రామానికి చెందిన దివ్యాంగులకైనా వసతి, భోజన సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తమ సొసైటీలో ముందుగా సభ్యత్వం పొందాలని ఆయన తెలిపారు.

ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ శిబిరం



మాట్లాడుతున్న జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ శకుంతల

నర్సీపట్నం: దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందజేసేందుకు నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ శకుంతల పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల మైదానంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపకరణాల పంపిణీకి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గుర్తింపు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. గుర్తింపు ప్రక్రియ ముగిసిన అనంతరం తేదీ ప్రకటించి ఉపకరణాలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ఎంఈవోలు సీహెచ్ తలుపులు, నాగేంద్ర మాట్లాడుతూ ఈ శిబిరాలు దివ్యాంగ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం శిబిరానికి విచ్చేసిన 60 మంది దివ్యాంగ విద్యార్థులను వైద్యులు పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ దేముడునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరాల్లో పలువురికి వైద్య సేవలు

కె.కోటపాడు : గుల్లేపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 166 మందికి చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం వైద్య సేవలందించారు. గర్భిణులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులను తనిఖీ చేశారు. రక్తహీనత గల విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందజేశారు. పౌష్టిక విలువలు గల ఆహారాన్ని పిల్లలకు ఇవ్వడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునని తల్లిదండ్రులకు వైద్యాధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మవానిపాలెంలో..

మాడుగుల రూరల్ : మండలంలోని తుమ్మవానిపాలెంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. కింతలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 70 మందికి కింతలి వైద్యాధికారి కె.ఎం.నాయుడు సారథ్యంలో బీపీ, సుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య సంరక్షణ

కశింకోట: స్థానికంగా లభ్యమయ్యే ఆకు కూరలు, కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తినడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.సుచరిత సూచించారు. మండలంలోని తాళ్లపాలెం-3 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా పోషణపై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలమృతంతో లడ్డూలు తయారు చేసి పిల్లలకు తినిపించాలన్నారు. లడ్డూ తయారీతోపాటు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల తయారీ గురించి డెమో చూపారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌పీ ప్రసాద్ మాట్లాడుతూ మునగాకు, చింత చిగురు, ఉసిరి, జామ పండ్లు ఆహారంలో భాగంగా చేసుకో వాలన్నారు. అంగన్ వాడీలు, ఆశకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

బుచ్చెయ్యపేట : నీలకంఠాపురంలో కోడి పందాలు ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు బుచ్చెయ్యపేట ఎస్‌ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గురువారం నీలకంఠాపురం ఊరి పొలమేరల్లో కోడి పందాలు ఆడుతున్న వారిపై తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. వీరి వద్ద నుండి రెండు కోడి పుంజులు, రూ. 4,700 నగదుతో పాటు ఏడుగురిని అదుపులోకి తీసికున్నామన్నారు. బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనల అమల్లో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈశ్వరమ్మ



కోనాం సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీవో రాంబాబు

నాతవరం : ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు నిబంధనలు అమలు చేయాలని తహసీల్దార్ ఎన్.సురేష్‌కుమార్, ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల నియమ నిబంధనలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించినా తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. అనుమతి లేకుండా రాజకీయ పార్టీల జెండాలు, హోర్డింగులు ఏర్పాటు చేయరాదన్నారు. ఎన్నికలకు సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చే ఫిర్యాదులపై యుద్ధప్రతిపాదికన స్పందించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, పంచాయతీ విస్తరణాధికారి ఎ.నర్సింహమూర్తి, కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా నిబంధనలు అమలు చేయాలి..

కె.కోటపాడు : ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పక్కాగా ఎన్నికల నిబంధనలు అమలు చేయాలని మండల సచివాలయ ఉద్యోగులకు మాడుగుల నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.ఈశ్వరమ్మ తెలిపారు. కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సచివాలయ సిబ్బందితో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఇప్పటికే గ్రామాల్లో పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, జెండాలు తొలగించే చర్యలు చేపట్టామన్నారు. ఇంకా ఏమైనా ఉంటే వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా గ్రామాల్లో ఇళ్లపై పార్టీల జెండాలు ఉంటే ఆయా ఇంటి యజమానుల అంగీకార పత్రంతో పాటు ఎన్నికల అధికారి అనుమతి పొందాలని ఆమె సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ గ్రామాల్లో ఉద్యోగులు షిఫ్ట్ పద్ధతి ప్రకారం 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆమె వివరించారు. సమావేశంలో ఎంపీడీవో అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల చిహ్నాలు తొలగించాలి..

చీడికాడ : గ్రామాల్లో ఏ రాజకీయ పార్టీకి చెందిన బొమ్మలు, ఫొటోలు, జెండాలు లేకుండా చూడాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి తెలిపారు. ఆమె మండలంలోని కోనాం సచివాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ మేరకు ఆమె సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, ఆదివారం, ఇతర సెలవు దినాల్లో కూడా సిబ్బంది విధులకు హాజరు కావాలని సూచించారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్ : ఎం. కోడూరు గ్రామంలో గల లక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణోత్సవాలు రెండవ రోజు గురువారం కూడా కొనసాగాయి. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సదస్యం, అనంతరం భజన కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు పి. రాంబాబు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఉత్సవాలు ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.
శుక్రవారం పల్లకీ సేవ, 23న స్వామివారికి చక్రస్నానం, నాగవల్లి కార్యక్రమం, 24న నాగవల్లి సంబరాలు, 25న పుష్పాంజలి సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

మాడుగుల రూరల్ : ఈ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం జెఈ కె. నర్సింగరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి ఈ ఏడాది మే 10వ తేదీ వరకు గ్రామాల్లో పాడైన మంచినీటి బోర్లకు మరమ్మతులు చేపట్టి, తాగునీటి సమస్య లేకుండా తమ సిబ్బంది చర్యలు చేపడతారని తెలిపారు. 29 గ్రామ పంచాయతీల పరిధిలో గల శివారు గ్రామాల్లో తాగునీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సామిల్లును కూలదోశారని పోలీసులకు ఫిర్యాదు

కె.కోటపాడు: సూరెడ్డిపాలెంలో తన సొంత స్థలంలో నిర్వహిస్తున్న సామిల్లును కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామిల్లు యజమాని కుభిరెడ్డి దేముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో వి.పైడంనాయుడు, ఎస్.ఎరుకునాయుడు, ఎస్.శ్రీను పొక్లెయిన్ సహాయంతో సామిల్లు కూల్చివేతకు పాల్పడినట్లు దేముడు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఫిర్యాదును ఎ.కోడూరు పోలీసులకు గురువారం ఆయన అందించారు. రెండేళ్ల క్రితం వేరే వ్యక్తి నుంచి తాను తీసుకున్న అప్పులు తీరుస్తానని వి.పైడంనాయుడు తన 74 సెంట్ల భూమిని తనఖా పెట్టించుకున్నాడని, నేటికీ పూర్తిగా వారికి డబ్బులు ఇవ్వలేదని దేముడు వాపోయారు. అప్పులు తీర్చకపోవడంతోపాటు తనఖా పెట్టిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లు దేముడు తెలిపారు. ఈ విషయమై సింగన్నదొరపాలేనికి చెందిన వి.పైడంనాయుడును వివరణ కోరగా సామిల్లు కూల్చివేత విషయం తనకు తెలియదని, తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. పోలీసులు ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



ఓటు నమోదు అవగాహన సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చోడవరం రూరల్ : ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎస్‌వీఈఈపీ, వెలుగు సంస్థలతో పాటు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదు, ఎన్నికల అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులను ఎనిమిది బృందాలుగా విభజించి ఎన్నికల అవగాహన, ఓటు వేసే విధానం పట్ల క్విజ్, స్లోగన్స్, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సీనియర్ అధ్యాపకులు ఎస్‌ఎం రఫీయుద్దీన్, హెచ్.సుధీర్, ఎ.కృష్ణారావు, రాధాకృష్ణ, లక్ష్మీ మంగమ్మ, ఐ.వి.సత్యవతి, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రత్నభారతి, డి.మాల్యాద్రి, ఈవోపీఆర్‌ఆర్డీ చైతన్య, ఏపీఎం కనకరాజు, వెలుగు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక ప్రయోజనం



కొండెంపూడిలో యువ రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బుచ్చెయ్యపేట : అధిక ఆదాయం పొందే ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త కె. రాజ్‌కుమార్ తెలిపారు. గ్రామీణ యువతకు వృత్తి నైపుణ్యాభివృద్ధిపై గురువారం కొండెంపూడిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రాయితీలతో కూడిన ఉద్యాన పంటల వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. జీడిమామిడి, జామి, పామాయిల్, కొబ్బరి, మామిడి, అరటి తదితర ఉద్యన పంటలకు ఉద్యానశాఖ ద్వారా రాయితీలు పొందవచ్చన్నారు. అలాగే ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి తడులు అందించడం వల్ల తక్కువ నీటితో ఎక్కువ పంటకి సాగు నీరు అందించవచ్చని, అలాగే జీడి మామిడి పూతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట దిగుబడులపై యువ రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానశాఖాధికారి శిరీష, శాస్త్రవేత్తలు ఎన్. సత్తిబాబు, ఎ. సౌజన్య, ఎన్. కిషోర్‌కుమార్, పి. బాలు పలువురు రైతుల ప్రశ్నలకు సమాధానాలు తెలిపి సలహాలు, సలహాలు అందించారు.

నేడు చిన అప్పనపాలెంలో కార్యకర్తలతో సమీక్ష

బుచ్చెయ్యపేట : మండలంలో గల చిన అప్పనపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో నేడు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల ఇన్‌చార్జి గేదెల శేషు తెలిపారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు మామిడి తోటలో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. 35 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోపరేటివ్ అధ్యక్షులు, ఇతర నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాల కవాతు



బైలపూడిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

చీడికాడ : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్‌ఐ నారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని బైలపూడి, అప్పలరాజుపురం, కోనాం, దిబ్బపాలెం, తునివలస, వరహాపురం, ఖండివరం, ఎల్.బి.పట్నం, జైతవరం గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ మేరకు గ్రామ పురవీధుల్లో తిరిగి ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.